లోపల దోమలు.. బయట పాములు

అపరిశుభ్ర వాతావరణంలో వసతి గృహాలు


డోర్నకల్‌లోని ఎస్సీ వసతి గృహమిలా..


మహబూబాబాద్‌లోని ఎస్సీ వసతి గృహం


వసతి గృహాల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరవయ్యాయి. అపరిశుభ్ర వాతావరణం మధ్య నానా అవస్థలు పడుతున్నారు. గదుల్లో కిటికీలకు జాలీలు లేక, తలుపులు లేక దోమలు దాడిచేస్తున్నాయి. దుప్పట్లు లేక దోమలతో కుట్టించుకుంటున్నారు. పంకాలు లేక, గాలి ఆడక ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. రాత్రివేళ ఆరు బయటకు వస్తే పరిసరాల అపరిశుభ్రత వల్ల పాముల సంచారంతో భయంగా గడుపుతున్నారు. జిల్లాలో వసతిగృహాలు ఎలా ఉన్నాయి.. విద్యార్థుల దయనీయంపై 'న్యూస్‌టుడే'యంత్రాంగం మంగళ, బుధవారాల్లో పరిశీలన చేయగా కనిపించిన దుస్థితి ఇది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపించింది.

–న్యూస్‌టుడే, మహబూబాబాద్ రూరల్

పరిశీలన

ఇతరులు వస్తున్నారు..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బాలుర ఎస్సీ వసతి గృహం పరిసరాల్లో గడ్డి మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారడంతో పాములు గదుల్లోకి వస్తున్నాయని విద్యార్థులు వాపోయారు. చాలా మంది సొంతూళ్లకు వెళ్లారు. ఈ, సీ వసతి గృహాలకు కలిపి 16 మంది విద్యార్థులకు ఏడుగురు మాత్రమే ఉన్నారు. వీరికి ఇద్దరు వార్డెన్లు, ఇద్దరు వాచ్‌మెన్లతో పాటు వంట కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. రాత్రి సమయంలో ఇతరులు వసతి గృహాలకు వచ్చి మద్యం తాగుతున్నారు. గుట్కా, అంబర్ తిని గోడలపైనే ఉమ్మి వేస్తున్నారు. ఈ వసతి గృహాన్ని ఇటీవల జిల్లా కలెక్టర్ తనిఖీ చేసినప్పటికీ ఎలాంటి మార్పు రాలేదు.


మహబూబాబాద్ ఎస్సీ వసతి గృహంలో గోడలపై గుట్కాల ఉమ్మి

వార్డెన్ చుట్టపు చూపు

పెద్దముప్పారం ఎస్సీ బాలుర వసతి గృహంలో 40 మందికి ప్రస్తుతం 30 మంది విద్యార్థులు ఉన్నారు. వార్డెన్ నెల రోజుల క్రితం జరిగిన బదిలీల్లో వెళ్లారు. మరిపెడలోని ఓ వసతి గృహం వార్డెన్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన స్థానికంగా అందుబాటులో ఉండటం లేదు నిత్యం కాపలాదారే దిక్కుగా మారారు. విద్యార్థుల వంటకు సరిపడా సరకులు ఇచ్చి వార్డెన్ వెళ్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. రెండు..మూడు రోజులకు ఒకసారి చుట్టపుచూపులా వచ్చి వెళ్తుండటంతో పర్యవేక్షణ కొరవడి పిల్లలు ఆటలు ఆడుతూ వృథాగా తిరుగుతున్నారు. విద్యార్థులకు కాస్మటిక్స్, ప్లేట్లు, పెట్టెలు, ఆట వస్తువులు, షూలు నేటికీ పంపిణీ చేయలేదు. రెండు గదుల్లోని నాలుగు ఫ్యాన్లకు ఒకటి పని చేయడంలేదు. రెగ్యులర్ ఏఎన్ఎంను నియమించలేదు. రాత్రి సమయాల్లో విద్యార్థులకు అనుకోకుండా ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారో తెలియని దుస్థితి నెలకొంది.


వార్డెన్ లేకపోవడంతో ఇష్టారీతిన తిరుగుతున్న విద్యార్థులు

మరుగుదొడ్లకు తలుపులు, కిటికీలకు మెష్‌లు కరవు

తొర్రూరు: చెర్లపాలెం ప్రభుత్వ వసతి గృహం అధ్వానంగా ఉంది. మరుగుదొడ్లకు సక్రమంగా తలుపులు లేవు. కిటికీలకు మెష్‌లు లేవు. పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా ఉంది. దుప్పట్లు పంపిణీ లేదని విద్యార్థులు వాపోయారు. వార్డెన్లు సక్రమంగా రావడం లేదని దుబ్బతండ, అమ్మాపురం సమీకృత వసతిగృహం విద్యార్థులు చెబుతున్నారు.




చెర్లపాలెం వసతిగృహంలో..

'జాలి' లేదు..

మహబూబాబాద్ మండలంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో 70 మంది విద్యార్థులకు 40 మంది మాత్రమే ఉంటున్నారు. గదుల్లో ఫ్యాన్లు మరమ్మతుకు రావడంతో రాత్రి సమయంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమల నివారణకు కిటికీలకు ఏర్పాటు చేసిన జాలీలు ధ్వంసమయ్యాయి. మరుగుదొడ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వసతి గృహం చుట్టూ చెత్తాచెదారం ఉండటంతో దోమలు విపరీతంగా వస్తున్నాయని విద్యార్థులు తెలిపారు.

దాతలూ.. స్పందించండి!

చలికాలం సమీపిస్తోంది. ప్రభుత్వ వసతిగృహాల్లో పేద విద్యార్థులు సరైన సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. చాలా వసతి గృహాల్లో పిల్లలకు దుప్పట్లు ఇంకా అందలేదు. కిటికీలకు సైతం తలుపులు, జాలీలు లేక సతమతమవుతున్నారు. చలిలో వణుకుతూ దోమలతో యుద్ధం చేస్తూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఈనేపథ్యంలో వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి దాతలు, స్పందించి సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉంది. స్థానికులు, ప్రజాప్రతినిధులు కూడా చేయూత అందిస్తే మేలు.

ఇతర మండలాల్లో ఎలా ఉన్నాయంటే..

☛ డోర్నకల్ లోని ఎస్సీ బాలుర వసతి గృహం పరిసరాల్లో పిచ్చి మొక్కలు పెరిగి చెత్తతో విద్యార్థులు దోమల బాధతో ఇబ్బందులు పడుతున్నారు.


☛ నెల్లికుదురులోని సాంఘిక సంక్షేమ గురుకులంలో చలికాలం సమీపిస్తునాన దుప్పట్లు పంపిణీ చేయలేదు. నిధుల చెల్లింపుల్లో జాప్యం వల్ల విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందటం లేదు.

క్రమశిక్షణ.. లాఠీ తప్పుతోంది!

తాజాగా ఒంటరిగా ఉన్న బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవికుమార్‌పై కాజీపేట ఠాణాలో పోక్సో కేసు నమోదు కావడం సంచలనం సృష్టించింది.

స్నేహపూర్వక పోలీస్ వ్యవస్థ అని చెబుతూ కొందరు పోలీసులు గాడి తప్పి వ్యవహరిస్తున్న తీరు ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాల్సిన చోట కొంతమంది హద్దులు మీరి ప్రవర్తిస్తున్నారు. వీరితో మొత్తం పోలీసు శాఖకు చెడ్డ పేరు వస్తోంది. అవినీతి, అక్రమ వసూళ్ల నుంచి మహిళలు, చిన్నారులపై అత్యాచారాల వరకు అధికారులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ఠాణాల్లో పోలీసు అధికారులపైనే కేసులు నమోదు కావడం చర్చనీయాంశమైంది.

– న్యూస్‌టుడే, వరంగల్‌క్రైం



ఫిర్యాదు చేసేందుకు భయం

పోలీసుశాఖలో వరుస ఘటనలు వెలుగు చూస్తుండటంతో సామాన్యులు ఠాణాలకు వచ్చి ఫిర్యాదులు చేసేందుకు భయపడుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దాలని కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

అక్రమ కేసులు, ఇతర వ్యవహారాల్లో జోక్యం చేసుకున్న పోలీసు అధికారులపై తాత్కాలికంగా చర్యలు తీసుకుంటున్నా కొద్ది రోజుల తర్వాత రాజకీయ నాయకుల అండదండలతో బయటకు వస్తున్నారు. వారి సిఫార్సు లేఖలతో కీలకమైన విభాగాల్లో పోస్టింగ్‌లు పొందుతున్నారు. తర్వాత కేసు విచారణ సమయంలో అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆరోపణలను రద్దు చేయించుకుంటున్నారు.

రాజకీయ జోక్యం తగ్గాలి

పోలీసు శాఖ పోస్టింగ్‌ల్లో రాజకీయ జోక్యం తగ్గితే చాలా వరకు మార్పులు వస్తాయి. ప్రతిభ ఆధారంగా పోస్టింగ్‌లు ఇస్తే కొంత వరకు ప్రజలకు మేలు జరుగుతుంది.

ఈ ఏడాది వరుస ఘటనలు..

● కేయూ ఠాణాలో పనిచేసిన ఎస్సై అనిల్ మరో ప్రభుత్వశాఖలో పనిచేస్తున్న ఉద్యోగినిని వేధించాడు. మహిళ భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

● జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలో పని చేస్తున్న సీఐ సంపత్ కేయూ ఠాణా పరిధిలో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమె కూతురుపైనా అత్యాచారం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

● పోలీసు శాఖలోని ఇతర విభాగంలో పనిచేస్తున్న సీఐ చింతగట్టు సమీపంలో అతిథి గృహంలో మహిళతో ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి వెళ్లేసరికి మహిళ తప్పించుకుంది. అనంతరం పోలీసులు దీనిపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు.

● గత ఏడాది పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్, మహిళ ఎస్సైతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. భర్త ఫిర్యాదు మేరకు విచారణ చేసిన అధికారులు ఇన్‌స్పెక్టర్, ఎస్సై ఇద్దరిని సస్పెండ్ చేశారు.

తొర్రూరు విపణి నూతన పాలకవర్గం నియామకం


తిరుపతిరెడ్డి


భట్టునాయక్

తొర్రూరు, న్యూస్‌టుడే: తొర్రూరు వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీని బుధవారం రాత్రి వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ప్రకటించారు. నూతన ఛైర్మన్‌గా తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామానికి చెందిన హనుమాండ్ల తిరుపతిరెడ్డి, ఉపఛైర్మన్‌గా దంతాలపల్లి మండలానికి చెందిన గుగులోతు భట్టు నాయక్‌ను నియమించారు. సభ్యులుగా అచ్చిరెడ్డి, వెంకటాచారి, గోపాల్, సంధ్యారాణి, నరేందర్, మల్లేశం, భాస్కర్, యాకసాయిలు, వెంకట్‌రెడ్డి, వాసు, విశ్వప్రసాద్, సామ రామ్మూర్తిలను నియమించారు.

సదరం సరే.. ఆసరా ఏదీ?

న్యూస్‌టుడే, మహబూబాబాద్

దివ్యాంగులకు ఆసరా పింఛన్ మంజూరు కోసం సదరం శిబిరాలు నిర్వహించి వైకల్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినా కొత్త పింఛన్ మంజూరుకు మాత్రం 2019 నుంచి మోక్షం లభించడం లేదు. కొత్త పింఛన్ ఎప్పుడు ఇస్తారంటూ సంబంధిత కార్యాలయాల చుట్టూ బాధితులు తిరుగుతున్నారు. అధికారులు మాత్రం ప్రతి నెలా సదరం శిబిరాలు నిర్వహిస్తూ వైకల్య నిర్ధారణ పరీక్షలు చేసి అర్హులైనవారికి ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. పింఛన్ మంజూరు విషయంలో మాత్రం గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా ఎలాంటి ప్రకటన చేయడం లేదు. రెండు వేలకు మందికి పైగా దివ్యాంగులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు.

	●	●
స్లాట్ నమోదు చేసుకున్నవారు	3,213	2,929
వైద్య పరీక్షలకు హాజరైనవారు	2201	1,881
అర్హత సాధించినవారు	1364	1,160

● 2023 జనవరి నుంచి డిసెంబరు వరకు
● 2024 సెప్టెంబరు 30 వరకు ఎంపికైన లబ్ధిదారులు


సదరం శిబిరంలో వైకల్య నిర్ధారణకు వచ్చిన దివ్యాంగులు

ఏడాదైన పింఛన్ రావడంలేదు...



నర్సింహులపేట మండలం జయపురం గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగుడైన ఈ బాలుడి పేరు శివరాత్రి యశ్వంత్ ఇతనికి 2023 మే నెలలో సదరం ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. పింఛన్ కోసం దరఖాస్తు చేసి ఏడాది దాటినా మంజూరు కాలేదు. బాలుడి తల్లిదండ్రులు ఉపాధి కోసం వలస వెళ్లారు. నానమ్మ, తాత భద్రమ్మ-వెంకన్న వద్ద ఉంటున్నాడు. మనుమడికి పింఛన్ వస్తే అతడికి ఆసరాగా ఉంటుందని వారు విన్నవిస్తున్నారు.

రెండేళ్ల నుంచి పింఛన్ కోసం..



ఈ ఫొటోలో కనిపిస్తుంది చల్ల లింగమ్మ. డోర్నకల్ మండలం తోడేళ్లగూడెం గ్రామానికి చెందిన ఈమె అగ్నిప్రమాదంలో కాళ్లు పోగొట్టుకుంది. 80 శాతం వైకల్యంతో నేలపైనే పాకుతూ వెళుతుంది. 2005 నుంచి దివ్యాంగుల పింఛన్ ఇచ్చారు. సర్టిఫికెట్ కాలపరిమితి ముగిసిందని రెండు సంవత్సరాల క్రితం పింఛన్ తీసివేశారు. 2023 సెప్టెంబరు 30న అధికారులు లింగమ్మకు మరోసారి దివ్యాంగుల ధ్రువీకరణ పత్రం జారీ చేసినా పింఛన్ మాత్రం మంజూరు కాలేదు.

☛ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు జారీ కానందున దివ్యాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేయలేక పోతున్నామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. కాలపరిమితి దాటిన వారు సకాలంలో పునరుద్ధరించుకుంటే వారికి పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు.

☛ అర్హులైన దివ్యాంగులందరికీ పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని దివ్యాంగుల హక్కుల సంఘాల నాయకులు దుగ్గి సారయ్య, వర్కె బాలకృష్ణ కోరారు. సుమారు నాలుగేళ్ల నుంచి కొత్త పింఛన్ రాక దివ్యాంగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.


మంత్రి కోమటిరెడ్డికి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

రోడ్లు, భవనాలకు నిధులివ్వరూ..

మహబూబాబాద్: మహబూబాబాద్ శాసనసభ్యుడు డాక్టర్ భూక్యా మురళీనాయక్ బుధవారం హైదరాబాద్‌లో రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిశారు. నియోజకవర్గంలో రహదారులు, ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే వివిధ సమస్యలపై మంత్రితో చర్చించినట్లు ఆయన వివరించారు. మురళీనాయక్‌తోపాటు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కంకర అయ్యప్పరెడ్డి, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు రమేశ్‌చందర్‌రెడ్డి ఉన్నారు.

తహసీల్దారుపై ఇసుక మాఫియా దాడికి యత్నం

కేసు నమోదు


ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న అధికారులతో ఘర్షణ పడుతున్న యజమాని యాకయ్య

నెల్లికుదురు, న్యూస్‌టుడే: నెల్లికుదురు మండలంలో ప్రవహిస్తున్న ఆకేరు వాగు నుంచి నిత్యం వందల ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇసుక మాఫియా ఏకంగా అధికారులతో ఘర్షణకు దిగింది. ఈ ఘటనలో ఇద్దరిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణకొత్తపల్లి శివారులోని వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు తహసీల్దారు రాజు ఆదేశాలతో ఆర్ఐ అబ్దుల్‌రెహమాన్, రెవెన్యూ ఉద్యోగులు కొందరు వెళ్లి వాగులో కనిపించిన మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశారు. ట్రాక్టర్ డ్రైవర్ సాయి సమాచారం ఇవ్వడంతో యజమాని యాకయ్య మద్యం మత్తులో వాగు వద్దకు చేరుకొని అధికారులను దూషిస్తూ అడ్డుకున్నాడు. విషయం తెలుసుకున్న తహసీల్దారు కె.రాజు ఘటనా స్థలానికి చేరుకున్నాడు. ఆయన్ను సైతం అసభ్యకరంగా మాట్లాడుతూ ఘర్షణకు దిగాడు. చివరికి అధికారులు పోలీసుల సహకారంతో వాగు వద్ద ఉన్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని ఠాణాకు తరలించారు.

☛ ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోబోయిన తహసీల్దారు, రెవెన్యూ అధికారులపై తిరగబడిన ట్రాక్టర్ డ్రైవర్ సాయి, యజమాని యాకయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. తమపై దాడికి ప్రయత్నించినట్లు తహసీల్దారు రాజు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

ప్రమాద ప్రాంతాలను గుర్తించండి


మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, పక్కన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జాతీయ రహదారులపై తరచుగా జరిగే రహదారి ప్రమాద ప్రాంతాలను గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్‌తో కలిసి బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి రహదారుల భద్రతా సమావేశంలో అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడారు. పోలీసు, ఇంజినీరింగ్ అధికారులు వివిధ ప్రాంతాలను సందర్శించి ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ప్రమాదాలు వాటి కారణాలు, ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటే ప్రమాదాలు అరికట్టవచ్చునే అంశాలపై కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రజల్లో కూడా అవగాహన కల్పించేందుకు కళా ప్రదర్శనలు నిర్వహించాలని ఆదేశించారు. ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ మాట్లాడుతూ జిల్లాలోని 20 ప్రదేశాల్లో ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటికే వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో గుంతలు పడిన రహదారులను మరమ్మతులు చేయడంతో పాటు స్పీడ్‌బ్రేకర్లు, స్టాపర్ రేడియం స్టిక్కర్లు, లైట్లు ఏర్పాటు చేశామన్నారు. మూలమలుపుల వద్ద చెట్లను తొలగించామన్నారు. అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్‌టొప్పో, ఎం.డేవిడ్, రహదారులు, భవనాల శాఖ ఈఈ బీమ్లానాయక్, ఆర్టీవో సాయికిరణ్, డాక్టర్ జగదీశ్వర్, వెంకటరమణ, మురళీధర్, చిప్ప ఉపేందర్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రానికి ప్రత్యామ్నాయం చూస్తాం


అర్ధాంతరంగా నిలిచిన డోర్నకల్ ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్రం సొంత భవనం వద్ద డా.ప్రమీల

ఈనాడు కథనానికి స్పందన

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్‌లోని ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్రం-1 నిర్వహణకు తాత్కాలిక వసతి కల్పనకు చేయూత అందించనున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.ప్రమీల తెలిపారు. 'అద్దె భవనానికి మరమ్మతులు..ఆరు బయటే విధులు!' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించి బుధవారం ఆమె డోర్నకల్ పర్యటనకు వచ్చారు. మరమ్మతుల్లో ఉన్న అద్దె భవనం చూశారు. అర్ధాంతరంగా నిలిచిన సొంత భవనం నిర్మాణ పనులు పరిశీలించారు. ఇవి అందుబాటులోకి వచ్చేదాక వేరొక చోట ప్రత్యామ్నాయ వసతి చూస్తామని తెలిపారు. ఆమె వెంట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.సాద్విజ, సిబ్బంది ఉన్నారు

ఆరు మండలాలకు నీటి సరఫరా పునరుద్ధరణ


మరిపెడ శివారులో చేపట్టిన పైపులైన్ పనులు

దంతాలపల్లి, న్యూస్‌టుడే: మిషన్ భగీరథ తాగునీటి జలాల సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. మరిపెడ శివారులోని ఎదళ్ల గుట్ట వద్ద ఉన్న వాటర్ గ్రిడ్ నుంచి మరిపెడ, నర్సింహులపేట, దంతాలపల్లి, నెల్లికుదురు, తొర్రూరు, రాయపర్తి మండలాలకు మిషన్ భగీరథ జలాలు సరఫరా అవుతాయి. కొన్ని రోజుల క్రితం గ్రిడ్ సమీపంలో పైపులైన్ దెబ్బతినడంతో నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో ప్రజలు పడుతున్న ఇబ్బందుల తీరుపై 'ఆరు మండలాలకు నిలిచిన నీటి సరఫరా' అనే శీర్షికతో ఈ నెల 22న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. యుద్ధ ప్రాతిపాదికన కొత్త పైపులైన్ పనులు మొదలుపెట్టి మరమ్మతులు పూర్తి చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. మరమ్మతుల అనంతరం ఆరు మండలాలకు శుద్ధి చేసిన జలాలను మంగళవారం రాత్రి విడుదల చేసినట్లు గ్రిడ్ ఏఈ రాకేష్ తెలిపారు. బుధవారం గ్రామాలకు మిషన్ భగీరథ జలాలు చేరుకోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

త్యాగాలు గుర్తించారు.. విధులు తెలుసుకున్నారు..!

జిల్లాలో పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పలు పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలల పిల్లలకు పోలీసుల విధులు, అమరుల త్యాగాలు, ఆయుధాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహబూబాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ పాల్గొని విద్యార్థులతో ఉత్సాహంగా గడిపారు. ఎస్పీతో కరచాలనానికి విద్యార్థులు ఉత్సాహం చూపారు.

మరిన్ని వివరాలు 7లో...


విద్యార్థులతో జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



పైప్‌లైన్ లీకేజీతో నీటి వృథా

మహబూబాబాద్ టౌన్: స్థానిక నర్సంపేట బైపాస్ రహదారిలో పైపులైను లీకేజీ ఏర్పడి నీరంతా వృథాగా పోతున్నా అధికారులు స్పందించడం లేదు. జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో ఎక్కడో ఒక చోట ఇదే పరిస్థితి నెలకొంది. పైప్‌లైన్‌ల లీకేజీ కారణంగా రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి.



ప్రగతి చక్రం.. పర్యావరణ హితం

• హనుమకొండకు చేరుకున్న ఎలక్ట్రికల్ బస్సులు

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే



'బస్సుల నిర్వహణ బాధ్యత జేబీఎం సంస్థకు అప్పజెప్పారు. వీటిని నడిపేందుకు ప్రత్యేక నైపుణ్యం కలిగిన డ్రైవర్లు అవసరం ఉండటంతో ఆ సంస్థనే నియామకాలు చేపట్టనుంది. ఆర్టీసీ.. కండక్టర్ల పర్యవేక్షణ బాధ్యతలు చూసుకుంటుంది. ఇవి అద్దె ప్రాతిపదికన నడుస్తాయి.'

మహాలక్ష్మి వర్తిస్తుంది..
ఎలక్ట్రికల్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ మహాలక్ష్మి పథకం, ఇతర అన్ని రకాల రాయితీలు వర్తిస్తాయి. సాధారణ ఛార్జీలే ఉంటాయి..

ప్రజా రవాణా వ్యవస్థ అనగానే ముందుగా అందరికీ గుర్తుకొచ్చేది ఆర్టీసీ. బస్సులు నిత్యం లక్షల కిలోమీటర్లు తిరుగుతూ వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. ఆధునిక వసతులతో మరింత సౌకర్యవంతమైన ప్రయాణ సదుపాయం కల్పిస్తూ ఆర్టీసీ సంస్థ ప్రయాణికుల ఆదరణ పొందుతోంది. ఇప్పటికే రాజధాని, గరుడ లాంటి ఏసీ బస్సులు, లహరి వంటి స్లీపర్ క్లాస్ బస్సులను ప్రవేశపెట్టింది. తాజాగా మరో అడుగు ముందుకేసి ఇంధన భారాన్ని తగ్గించుకోవడంతో పాటు పర్యావరణాన్ని రక్షించాలనే ఉద్దేశంతో ఎలక్ట్రికల్ బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చింది.

మూడు రకాలుగా..

- పర్యావరణ హితంగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రికల్ బస్సుల్లో వరంగల్ రీజియన్‌కు 84 కేటాయించారు.
- డీలక్స్, సూపర్‌లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ మూడు రకాలు ఉంటాయి. వీటిని హైదరాబాద్ - వరంగల్, వరంగల్-కరీంనగర్ రూట్‌లో నడపనున్నారు.
- రీజియన్‌కు బుధవారం రాత్రి వరకు నాలుగు డీలక్స్, ఒకటి సూపర్ లగ్జరీ మొత్తం 5 బస్సులు చేరుకున్నాయి.
- సూపర్ లగ్జరీలో డ్రైవర్ సీటుతో కలిపి 42, డీలక్స్ బస్సుల్లో 45, ఎక్స్‌ప్రెస్‌లో 55 సీట్లు ఉంటాయి. వీటికి ఛార్జింగ్ అవసరం ఉన్నందున డిపోలో 12 ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు.

ఎలక్ట్రికల్ బస్సులకు గేర్లు ఉండవు



- చాల్లెటి కిరణ్, ఆర్టీసీ సీనియర్ డ్రైవర్, వరంగల్ 2 డిపో

మామూలు ఆర్టీసీ బస్సులకు గేర్లు ఉంటాయి. ఎలక్ట్రికల్ బస్సులకు ఉండవు. ఎక్కువ స్పీడ్ వెళ్లకుండా లాక్ చేస్తారు. సీటింగ్, ఇతర మొత్తం మామూలు బస్సుల లాగే ఉంటాయి. శబ్ద కాలుష్యం ఉండదు. వైబ్రేషన్ ఉండదు. అద్దె ప్రాతిపదికన కాకుండా ఆర్టీసీ సొంతంగా ఈ బసులను నిర్వహిస్తే మరింత ఉపయోగకరంగా ఉండేది. దీంతో పాటు ఆర్టీసీ డ్రైవర్లుగా కొంత మందికి ఉపాధి దొరుకుతుంది.

ఇవీ ప్రత్యేకతలు..







- 1.45 గంటలు ఛార్జింగ్ చేస్తే 350 కిలో మీటర్ల దూరం ప్రయాణిస్తాయి.
- ప్రయాణికులకు అత్యవసరమైతే బస్సును ఆపేందుకు ప్రతి సీటుపై ఎస్ఓఎస్ మీట పెట్టారు.
- బస్సుకు మొత్తం 5 సీసీ కెమెరాలు అమర్చారు. డ్రైవర్ సీటు ముందు భాగంలో కెమెరా మానిటరింగ్ చేసే విధంగా ఏర్పాటు చేశారు.
- ప్రతి సీటు వద్ద చరవాణి ఛార్జింగ్ పాయింట్ ఇచ్చారు.
- డ్రైవర్ మాట్లాడితే ప్రయాణికులకు వినపడేలా మైక్ సిస్టం ఏర్పాటు చేశారు.
- ఈ బస్సులకు ఇంటెలిజెన్స్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం అందుబాటులో ఉంది. దీని ద్వారా బస్సు ఎక్కడ ఉందో జీపీఎస్ ద్వారా తెలుసుకునే అవకాశం కల్పించారు.
- డోర్ తెరిచి ఉంటే బస్సు స్టార్ట్ కాదు. దీనికి గేర్ సిస్టం ఉండదు. కేవలం ఎక్స్‌లెటర్ మాత్రమే ఉంటుంది. గంటకు 80 కిలోమీటర్ల వేగానికి మించి పోకుండా స్పీడ్ లాక్ చేశారు.
- జీపీఎస్‌తో అనుసంధానమై ఉండటంతో ప్రయాణికులు గమ్యం యాప్ ద్వారా ఈ బస్సు ఎక్కడ ఉంది, ఎక్కడికి వరకు వచ్చింది, గమ్యస్థానం చేరుకోవడానికి ఇంకా ఎంత సమయం పడుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.
- అగ్నిప్రమాదం జరిగే అవకాశం ఉంటే ముందుగానే పసిగట్టి అలారం మోగే విధంగా సాంకేతికతను ఉపయోగించారు. అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే సమీపంలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందేలా ఏర్పాటు చేశారు.



ఇటీవల కటాక్షపూర్ లో లెవెల్ కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వరద..

ఎట్టకేలకు లభించిన కటాక్షం

• వంతెన నిర్మాణానికి మార్గం సుగమం..

ఎన్నో ఏళ్ల కల.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కటాక్షపూర్ వంతెన నిర్మాణం.. ఎట్టకేలకు నెరవేరబోతోంది. ఈ వంతెనతోపాటు మరో చోట మూల మలుపును నేరుగా చేసేందుకు అవసరమైన భూ సేకరణ జరిపేలా బుధవారం కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. భూ సేకరణ పూర్తయితే వంతెన పనులను చేపట్టనున్నారు.

పరకాల, న్యూస్‌టుడే

అత్యంత కీలకం..

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కలిపే హైదరాబాద్-భూపాలపట్నం 163 జాతీయ రహదారిలో కటాక్షపూర్ వంతెన నిర్మాణం అత్యంత కీలకం. కటాక్షపూర్ చెరువు వద్ద శిథిలావస్థకు చేరిన లో లెవెల్ కాజ్‌వేతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలంలో చెరువు మత్తడి పడి రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరతో పాటు పర్యాటక ప్రదేశాలైన లక్నవరం, రామప్ప, బొగత జలపాతం వంటి ప్రాంతాలకు వెళ్లే ప్రధాన మార్గం ఇదే కావడం వల్ల అన్ని ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరద ఉద్ధృతి ఉంటే పూర్తిగా రాకపోకలు స్తంభించిపోతాయి.

భూసేకరణే ఆలస్యం..

కటాక్షపూర్ లెవెల్ కాజ్‌వే చోట వంతెన నిర్మించడానికి ఏడాదిన్నర కిందట రూ.312 కోట్లను విడుదల చేయగా టెండర్ ప్రక్రియ కూడా ముగిసింది. వంతెనను వెడల్పుగా నిర్మించడానికి హౌజ్‌బుజుర్గు, కటాక్షపూర్ గ్రామాల మధ్య కొంతమేర భూ సేకరణ అవసరం. అదే సమయంలో నీరుకుళ్ల క్రాస్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపును నేరుగా చేయడానికి సైతం ఇరువైపుల భూమి కావాలి. ఈ రెండు చోట్ల అవసరమైన భూ సేకరణకు అనుమతి ఇవ్వాలని ఆర్ అండ్‌బీ(జాతీయ రహదారి) అధికారులు నెల రోజుల కిందట కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు బుధవారం భూ సేకరణకు కేంద్ర రహదారి, రవాణా శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ బాధ్యతలను పరకాల ఆర్డీవోకు అప్పగించారు.. భూ సేకరణ సర్వే చేసి బాధిత రైతులకు పరిహారం ఇచ్చిన వెంటనే వంతెనతోపాటు మూలమలుపును నేరుగా చేసే పనులు ప్రారంభం కానున్నాయి.

జులై వరకు గడువు..

163వ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మధ్యలో నుంచి ఏటూరునాగారం 50 ఫీట్లతో కూడిన నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులను హనుమకొండ, ములుగు జిల్లాల్లో కలిపి మొత్తం 36 కిలోమీటర్లు పూర్తి చేయాల్సి ఉంది. ఇందులో హనుమకొండ జిల్లాలో 20 కిలోమీటర్లు, ములుగు జిల్లాలో 10 కిలోమీటర్ల వరకు పనులు చేయాలి. వీటికోసం రూ.208 కోట్లను విడుదల చేయగా 2022లో పనులను చేపట్టారు. వచ్చే ఏడాది జులై వరకు ఈ పనులను పూర్తి చేయడానికి గడువు.
• దీనిపై పరకాల ఆర్డీవో కె.నారాయణ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ భూ సేకరణకు సంబంధించిన నోటిఫికేషన్ వివరాలు ఇంకా తమకు రాలేదన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిన శాతవాహన

వందేభారత్ సహా పలు రైళ్లు ఆలస్యం

డోర్నకల్, న్యూస్‌టుడే: విజయవాడ- సికింద్రాబాద్ మధ్య నడిచే శాతవాహన సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ (12713) బుధవారం మహబూబాబాద్ రైల్వేస్టేషన్ దాటాక కిలోమీటరు దూరంలో సాంకేతిక లోపంతో నిలిచింది. రైలింజన్ మీదుండే ప్యాంటో మొరాయించిందా? లేదా ఓవర్ హెడ్ ఎలక్ట్రిఫికేషన్‌లో సమస్య తలెత్తిందా అన్నది రైల్వే అధికారులే ఒక అంచనాకు రాలేకపోయారు. తర్వాత లోపాన్ని సరిదిద్ది రైలును నడిపారు. శాతవాహనకు ఉదయం 9.02 నుంచి 9.39 గంటల వరకు 37 నిమిషాలపాటు అంతరాయం కలగడంతో ఇతర రైళ్లు ఆలస్యంగా నడిచాయి. గుండ్రాతిమడుగు దాటాక నిలిచిన ఒక గూడ్స్ రైలు మొరాయించడంతో మహబూబాబాద్ నుంచి మరో ఇంజిన్ పంపించి తీసుకొచ్చారు. ఈలోగా గుండ్రాతిమడుగు స్టేషన్‌లో విశాఖపట్నం- ముంబయి ఎల్‌టీటీ సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్(18519) రైలు గంట, డోర్నకల్‌లో గుంటూరు- సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్(17201) గంట 10 నిమిషాలు, విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్(20833) ఎక్స్‌ప్రెస్ పాపటపల్లి రైల్వేస్టేషన్‌లో గంటకు పైగా నిలిచాయి.

పట్టణాభివృద్ధికి శ్రీకారం!


• ప్రభుత్వానికి చేరిన ప్రతిపాదనలు

పట్టణీకరణ శరవేగంగా పెరుగుతోన్న నేపథ్యంలో ప్రణాళిక బద్ధమైన విస్తరణ, అభివృద్ధి, నాణ్యమైన పట్టణవాసం కల్పించడమే లక్ష్యంగా జిల్లాకో పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ- యూడీఏ)లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. గతంలో ఉన్న పట్టణాభివృద్ధి సంస్థలను అవసరమైన చోట విస్తరించాలని, ఇందుకు అవకాశాలు లేని చోట కొత్తవి ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో కొత్తగా 18 సంస్థలను ఏర్పాటు చేయనుంది. – జనగామ, న్యూస్‌టుడే

'ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటికే వరంగల్, హనుమకొండ జిల్లాలు 'కుడా' పరిధిలో ఉన్నాయి.'

'ఏజెన్సీ ప్రాంతం అత్యధికంగా ఉన్న జిల్లాలను ఈ ప్రక్రియ నుంచి మినహాయించారు. దీంతో ములుగు జిల్లాకు ఈ అవకాశం లేదు. మహబూబాబాద్, భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో పట్టణాభివృద్ధి సంస్థల ఏర్పాటుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయి..'

యూడీఏ	వైశాల్యం (చ.కి.మీ),	జనాభా–2011	జనాభా(2024) అంచనా	పురపాలికలు /గ్రామాలు
జనగామ(జుడా)	1654.756	403516	454168	1/225
భూపాలపల్లి(బుడా)	2293	416763	462249	1/242
మహబూబాబాద్(ముడా)	1891.75	600101	654961	4/163




ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో..

జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కన్వీనర్‌గా, జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో), జిల్లా గ్రామీణ, పట్టణ ప్రణాళిక అధికారి(డీటీసీపీవో), ఆర్డీవోలు, పురపాలక కమిషనర్లు, సర్వే లాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేశారు. వీరు జిల్లా కేంద్రంతో పాటు పట్టణీకరణ ప్రభావం, విస్తరణకు అవకాశాలున్న గ్రామాలు, 2011 జనాభా, ప్రస్తుత అంచనా జనాభా, ఏరియా తదితర వివరాలతో నక్షా(ప్లాన్) తదితర వివరాలతో ప్రతిపాదనను పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ద్వారా ప్రభుత్వానికి పంపించారు.

జనగామ పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (జుడా)

'జనగామ మున్సిపల్ సహా 226 గ్రామాలను జుడా పరిధిలో చేర్చాలని ప్రతిపాదించారు.'

2017లో 10 మండలాలతో జనగామ పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. ప్రస్తుతం జిల్లా పరిధిలో 12 మండలాలుండగా, జఫర్‌గఢ్, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాలు 'కుడా' పరిధిలో ఉన్నాయి. వాటిలో మార్పు లేదు. 283 గ్రామాలకు గాను.. ఈ జిల్లా సూర్యాపేట, భువనగిరి యాదాద్రి, సిద్దిపేట, వరంగల్ జిల్లాలతో సరిహద్దు కలిగి ఉంది.



• విద్య, వైద్యం, వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందుతున్న క్రమంలో రైలు, రోడ్డు, భూముల క్రయవిక్రయాలకు అనువుగా ఉన్న కారణంతో జుడా పరిధిలోకి తేవాలని ప్రతిపాదించారు.

భూపాలపల్లి (బుడా)

'భూపాలపల్లి పురపాలిక సహా 242 గ్రామాలతో 'బుడా' ఏర్పాటుకు ప్రతిపాదించారు.'

కరీంనగర్, వరంగల్ జిల్లాల పరిధిలోని ప్రాంతాలను పునర్వ్యవస్థీకరించి భూపాలపల్లి జిల్లాను ఏర్పాటు చేశారు. ఆరు జిల్లాలు, రెండు రాష్ట్రాలతో సరిహద్దు బంధం కలిగి ఉంది. ప్రాణహిత, గోదావరి పరివాహక ప్రాంతాలు, సింగరేణి, కేటీపీపీ వంటి పరిశ్రమలు, కాళేశ్వరం ప్రాజెక్టు కేంద్రంగా ఉంది.
• ఎన్‌హెచ్ 353సి, ఎన్‌హెచ్ 163జితో అనుసంధానమై వ్యాపార, వాణిజ్య, వ్యవసాయ, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధికి అవకాశం ఉన్నందున పట్టణీకరణకు విస్తార అవకాశాలున్నందున జిల్లా పట్టణాభివృద్ధి సంస్థ అవసరమని ప్రతిపాదించారు.



మహబూబాబాద్ (ముడా)

'మహబూబాబాద్, డోర్నకల్, తొర్రూరు, మరిపెడ(4) పురపాలికలు, 163 రెవెన్యూ గ్రామాలతో ముడాను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.'

ఎన్‌హెచ్ 365 పరిధిలోని మహబూబాబాద్ ఏడు జిల్లాలతో సరిహద్దు కలిగి ఉంది. ఎన్‌హెచ్ 563, ఎన్‌హెచ్ 930పి, ఎన్‌హెచ్ 163జితో అనుబంధాన్ని కలిగి ఉంది. సికింద్రాబాద్-విజయవాడ మధ్య రైలు సౌకర్యంతో ఉన్న జిల్లాలో భవిష్యత్తులో వ్యాపార, వాణిజ్య ఇతర రంగాల అభివృద్ధికి అన్ని అవకాశాలున్నందున ముడా ఏర్పాటుకు ప్రతిపాదించారు.



కొనుగోలుదారుల ఆదరణ పొందాలి



రిబ్బన్ కత్తిరించి షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, మాధవరెడ్డి

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : నాణ్యమైన వస్త్రాలతో కొనుగోలుదారుల ఆదరణ పొందాలని వరంగల్ పశ్చిమ, నర్సంపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి అన్నారు. హనుమకొండ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ షోరూంను బుధవారం వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఏ వ్యాపారానికైనా కొనుగోలుదారుల నమ్మకమే ముఖ్యమన్నారు. ప్రముఖ వస్త్ర వ్యాపారి కాసం నమఃశివాయ మొదటి కొనుగోలుదారుగా దుస్తులు కొన్నారు. షోరూం జీఎం సశింద్రన్ నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఇదే పెద్ద షోరూం అన్నారు. దక్షిణ భారతంలో రామ్‌రాజ్ షోరూంలు అత్యంత ప్రజాదరణ పొందాయన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ముప్పిడి విజయ్‌కుమార్‌రెడ్డి, రామసహాయం హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్-23 క్రికెట్ విజేత హనుమకొండ జట్టు



జట్టు సభ్యులతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-23 క్రికెట్ పోటీల్లో హనుమకొండ జట్టు విజేతగా నిలిచింది. హనుమకొండలోని రెడ్డిపురంలో ఉన్న టీవీవీ సుఖాంత్ క్రీడా మైదానంలో ఈ నెల 20 నుంచి 23 వరకు వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హనుమకొండ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. ఛేదనకు దిగిన మహబూబాబాద్ జట్టు 16 ఓవర్లలో 64 పరుగులకే కుప్పకూలింది. విజేత హనుమకొండ, రన్నరప్‌గా నిలిచిన మహబూబాబాద్ జట్లకు అతిథులు ట్రోఫీలు అందించారు. కార్యక్రమంలో వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, ఇతర ప్రతినిధులు ఉపేందర్, రాము, మట్టెడ కుమార్, మాజీ కార్యదర్శి ఉదయభానురావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు



విజేతలతో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, అతిథులు

వరంగల్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలు బుధవారం ముగిశాయి. హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం వేడుకల మందిరంలో నిర్వహించిన అండర్-15 విభాగం పోటీల ముగింపు వేడుకలకు వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ధ్రువపత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చదరంగం పోటీలకు వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్‌ను ఉచితంగా వినియోగించుకోవచ్చన్నారు. విజేతలు నవంబరు 3 నుంచి 11 వరకు తమిళనాడులో జరిగే జాతీయస్థాయి చదరంగం పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. చీఫ్ ఆర్బిటర్ సాయిప్రసాద్, ఆర్బిటర్లు శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి పాల్గొన్నారు.

విజేతలు: బాలుర విభాగంలో యోహాన్ యాదవ్, ప్రణయ్, అంజనికుమార్, సాహర్ష, బాలికల విభాగంలో యాశ్విజైన్, శరణ్య, సహర్ష, శ్రీలాస్య తొలి నాలుగు స్థానాల్లో నిలిచారు.

మూసీ పునరుద్ధరణలో నిర్వాసితులకు న్యాయం చేయాలి



రహదారి పనులు పరిశీలిస్తున్న సీపీఐ కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు, నాయకులు

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో మూసీ నది పునరుద్ధరణ, హైడ్రాలో ఇళ్లు కోల్పోయిన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో పార్టీ సమావేశానికి హాజరై ఖమ్మం వెళ్తూ.. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లిలో పార్టీ నాయకులతో కలిసి ఎల్కతుర్తి - సిద్దిపేట జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాతీయ రహదారి పనులు నాసిరకంగా సాగుతున్నాయని, దీనిపై విజిలెన్స్ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఆచార్య సాయిబాబు మృతి కేంద్ర ప్రభుత్వ హత్యగా అభివర్ణించారు. ఇటీవల హరియాణాలో జరిగిన ఎన్నికల్లో భాజపాది నిజమైన విజయం కాదని, కాంగ్రెస్ వైఫల్యంతో అధిక సీట్లు వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గడువులోపు హామీలను అమలు చేయకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు.కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)
వెన్‌కాబ్

ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

కోచ్ ఫ్యాక్టరీపై స్పష్టత అవసరం



కాజీపేట రైల్వే జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కాజీపేట, న్యూస్‌టుడే: కాజీపేటలో నిర్మిస్తామంటున్న కోచ్ ఫ్యాక్టరీపై కేంద్రం నుంచి స్పష్టమైన ప్రకటన రావాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. బుధవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి కాజీపేట రైల్వే జంక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, అయోధ్యపురంలో వ్యాగన్ తయారీ కేంద్రం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణంపై గురువారం దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) జీఎంతో జరిగే సమావేశంలో ప్రస్తావిస్తానని, తర్వాత రైల్వే శాఖ మంత్రిని కలుస్తానని చెప్పారు. జిల్లా వాసుల చిరకాల స్వప్నం కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ సాధనకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కాజీపేట - బల్లార్షా మార్గంలో నాలుగు లైన్ల నిర్మాణం పూర్తికావడంతో కాజీపేట మీదుగా మరిన్ని రైళ్లు తిరిగే అవకాశం ఉందని, దీనికి అనుగుణంగా ప్లాటుఫారాలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కాజీపేట స్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, విశ్రాంత గదుల నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాజీపేటలో బస్టాండ్ లేక పోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, రైల్వే స్థలం ఇస్తే బస్టాండ్ నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం రైల్వే ఆసుపత్రిని సందర్శించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ సీఈ లక్ష్మీ నారాయణ, సీనియర్ డీఈఎన్ వెంకట్, సీడీఎం అనికేత్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయశ్రీ పాల్గొన్నారు.

పోలీసు సేవలపై విద్యార్థులకు అవగాహన

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మహబూబాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసుల విధులు, ఆయుధాలు, బాంబ్ స్క్వాడ్ పరికరాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా పోలీస్ అధికారి సుధీర్ రాంనాథ్ కేకన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు 300 మంది పాల్గొన్నారు. ఆర్మ్‌డ్ ఫోర్స్ అధికారులు, సిబ్బంది వినియోగించే వివిధ రకాల ఆయుధాల గురించి. సీసీ కెమెరాల వల్ల కలిగే ప్రయోజనాలు. ట్రాఫిక్ నియమ నిబంధనలు, చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. భరోసా కమాండ్ కంట్రోల్ గది, రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ లేజర్ గన్, మత్తు పదార్థాలకు సంబంధించిన పరికరాలతోపాటు డాగ్ స్క్వాడ్, సైబర్ క్రైమ్ తదితర సామగ్రిని ప్రదర్శించారు. మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు మాట్లాడుతూ.. పోలీస్ అమరుల త్యాగాల గురించి విద్యార్థులకు తెలిపేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సైబర్ నేరాలకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలిక, మహిళల రక్షణకు ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, పట్టణ సీఐ దేవేందర్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరులో...

గూడూరు పోలీస్ స్టేషన్‌లో సీఐ బాబురావు ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. ఆయుధాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్సై, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లికుదురులో.

నెల్లికుదురు: నెల్లికుదురు ఎస్సై సీహెచ్.రమేష్‌బాబు ఆయుధాల వినియోగం పై అవగాహన కల్పించారు. పోలీసుల త్యాగాలను వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం.అనిల్‌కుమార్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కురవిలో..

కురవి: పోలీస్ శాఖ నిర్వహిస్తున్న శాంతి భద్రతలపై మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య అవగాహన కల్పించారు. కురవి ఎస్సై సతీశ్, ఏఎస్సై సదయ్య సిబ్బంది ఉన్నారు.



గూడూరులో పాల్గొన్న సీఐ విద్యార్థినీ విద్యార్థులు

నర్సింహులపేటలో..

నర్సింహులపేట: పోలీస్ విధి విధానాలగురించి, నూతన పరికరాలు, పోలీసు చట్టాలు, సీసీ కెమెరాల వల్ల కలిగే ఉపయోగాలు, డాగ్ స్క్వాడ్, ఫింగర్‌ప్రింట్ పరికరాలు, సైబర్ నేరాలు, రోడ్డు నిబంధనలు, ఆయుధాలు వాటి పనితీరుపై ఎస్సై మాలోతు సురేష్ అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాల బారిపడకుండా జాగ్రత్తలు వివరించారు.

బయ్యారంలో..

బయ్యారం: బయ్యారం పోలీసు స్టేషన్లో ఓపెన్ హౌజ్ నిర్వహించారు. జూనియర్ కళాశాల విద్యార్థులు సందర్శించగా, పోలీసుల విధులన ఎస్సై తిరుపతి, పోలీసు సిబ్బంది వివరించారు.

తొర్రూరు: పోలీసుల విధులపై విద్యార్థులకు అవగాహన అవసరమని సీఐ జగదీష్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ పాఠశాలల విద్యార్థులతో బుధవారం ఓపెన్ హౌజ్ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్సై రాంజీనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



నెల్లికుదురులో ..



కురవిలో అవగాహన కల్పిస్తున్న సీఐ సర్వయ్య



నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌లో..



తొర్రూరులో..

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్‌లో బ్రాహ్మణ కుంట సమీపంలోని ఆవాసాల వద్ద నడక బాటపై ఏపుగా పెరిగిన పొదలతో ఇబ్బంది పడుతున్నాం. .రాజు, స్థానికులు

● పొదల తొలగింపు చర్యలు చేపడతాం. **- అహ్మద్, హెల్త్ ఇన్‌స్పెక్టర్, డోర్నకల్**

ఆర్టీవో బాధ్యతలు స్వీకరణ

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారిగా బానోతు భద్రునాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రెండు నెలల పాటు డీటీవోగా అదనపు బాధ్యతలు నిర్వహించిన టి.జయపాల్‌రెడ్డి వరంగల్‌కు పూర్తి స్థాయి అధికారిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జగిత్యాల ఎంవీఐగా పని చేసిన భద్రునాయక్‌ను మహబూబాబాద్‌కు బదిలీ చేశారు. ఇక్కడ ఎంవీఐగా విధులు నిర్వహించిన వెంకటపుల్లయ్య భద్రాచలం బదిలీ అయ్యారు.



బానోతు భద్రునాయక్

స్థానిక సంస్థల రిజర్వేషన్ల అమలుకు చర్యలు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో దామాషా ప్రకారం స్థానిక సంస్థల వారీగా అవసరమైన రిజర్వేషన్లను కల్పించే అంశంపై బుధవారం హైదరాబాద్ నుంచి బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ జిల్లా కలెక్టర్లతో దూరదృశ్య సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై ఛైర్మన్ నిరంజన్ అధికారులకు సూచనలు చేశారు. నవంబరు 2న వరంగల్ ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. బీసీల సమస్యలపై అధికారులకు వచ్చిన ఫిర్యాదులు, ఇతర నివేదికలను తమవెంట తీసుకురావాలని అధికారులను కోరారు.



దూరదృశ్య సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి నరసింహస్వామి

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం అందిస్తున్న పథకాలను యువత సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను పారిశ్రామిక రంగంలో ప్రోత్సహించేందుకు రాయితీతో రుణాలను అందిస్తున్నాయన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఎ.సత్యనారాయణ, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ నరేష్, బీసీ సంక్షేమ శాఖాధికారి నరసింహస్వామి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, టీపీవో సాయిరాం, వివిధ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీసు అమరుల త్యాగాలే స్ఫూర్తి

మరిపెడ, న్యూస్‌టుడే: పోలీసు అమరుల త్యాగాలే స్ఫూర్తిగా ముందుకు సాగాలని మరిపెడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. మరిపెడ పట్టణంలోని ప్రధాన జాతీయ రహదారిపై బుధవారం రాత్రి పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఎస్సైలు సతీష్, సంతోష్, ఝాన్సీ, నగేష్, నాయకులు అఫ్జల్, తాజొద్దీన్, అల్వాల శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న పోలీసులు

వీపీవోపై అధికారులకు ఫిర్యాదు

మరిపెడ, న్యూస్‌టుడే: సంఘాల్లోని మహిళలను మోసగిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న గ్రామైక్య సంఘాల సహాయకురాలిపై చర్యలు తీసుకోవాలని ఎల్లంపేట గ్రామానికి చెందిన పలువురు నాయకులు సంబంధిత శాఖ మండల, జిల్లా స్థాయి అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వీవోఏగా పనిచేస్తున్న కేక మోహిని మహిళలకు రుణాలు ఇప్పించేందుకు డబ్బులు వసూలు చేస్తోందని ఆరోపించారు. జిల్లా పాలనాధికారి కార్యాలయంలో, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి మధుసూదన్, మరిపెడ ఏపీఎం రాములుకు ఫిర్యాదులు అందజేసినట్లు నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఏఈవోపై..

మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీపురం(బి) వ్యవసాయ విస్తరణాధికారి పంట నష్టపోయిన రైతులకు కాకుండా భూమిలేని వారికి పరిహారం చెల్లింపులు చేయడంపై బుధవారం కలెక్టర్‌కు గ్రామ రైతులు ఫిర్యాదు చేశారు. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన ఏఈవోపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నర్సింహులపేట, న్యూస్‌టుడే: పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన నర్సింహులపేట మండలం బాసుతండాలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం నెల్లికుదురు మండలం కాస్య తండా పంచాయతీకి చెందిన శిరీషకు మండలంలోని బాసుతండాకు చెందిన గుగులోతు వెంక్యాతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారైలు. అదనపు కట్నం కోసం తరుచూ వెంక్యా ఇబ్బందులు పెట్టేవాడు. ఈ నెల 12న వేధించడంతో ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నాకి పాల్పడింది. స్థానికులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శిరీష తండ్రి బానోతు వెంకన్న బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు.



రైతులకు పత్తిలో అధిక దిగుబడి గురించి వివరిస్తున్న శాస్త్రవేత్తలు

క్షేత్ర దినోత్సవం

ఇనుగుర్తి, న్యూస్‌టుడే: ఇనుగుర్తి మండలం పెద్దతండా గ్రామపంచాయితీ పరిధిలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్రం మల్యాల ఆధ్వర్యంలో అధికసాంద్రత పత్తిసాగుపై బుధవారం క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. జాతీయ పత్తి పరిశోధన సంస్థ కోయంబత్తూరు శాస్త్రవేత్త డాక్టర్ డి కంజన, డాక్టర్ ఎస్.మాలతి, డాక్టర్ జి వీరన్న పాల్గొని అధిక సాంద్రత పత్తి సాగు వలన కలిగే ప్రయోజనాలు, వివరించారు. కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు కిశోర్, క్రాంతి, జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, మండల వ్యవసాయ అధికారి మహేందర్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల చలో కలెక్టరేట్

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: ఉపకార వేతన బకాయిలు, ఫీజు రీయంబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాగం లోకేష్, వెలుగు శ్రావణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని పలు కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీగా బయలుదేరారు. విద్యార్థులను కలెక్టరేట్ కార్యాలయంలోకి వెళ్లకుండా గేటు వద్ద పట్టణ సీఐ పెండ్యాల దేవేందర్ అడ్డుకున్నారు. అనంతరం విద్యార్థినాయకులు, విద్యార్థులు కలెక్టరేట్ కార్యాలయం గేటు వద్ద కూర్చొని ఆందోళన వ్యక్తం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉపకారవేతన బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఈ నెల 27వ తేదీ లోపు విడుదల చేయాలన్నారు. అనంతరం సీఐ అనుమతితో కొందరు విద్యార్థినాయకులు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సమితి సభ్యుడు బందు మహేందర్, జిల్లా కమిటి నాయకులు మేక వెంకటేష్, చిలువేరు వికాస్, సాయి, ప్రకాశ్, అశోక్, ప్రనయ్, పలు కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు, విద్యార్థులు

విద్యుత్తు అధికారుల పొలం బాట

నర్సింహులపేట, న్యూస్‌టుడే: రైతులకు విద్యుత్తు ప్రమాదాల గురించి అవగాహన కల్పించేందుకే విద్యుత్తు అధికారులు పొలంబాట కార్యక్రమం చేపట్టినట్లు తొర్రూరు డీఈఈ మధుసూదన్ అన్నారు. గోపాతండాలో విద్యుత్తు అధికారుల పొలంబాట కార్యక్రమంలో బుధవారం పాల్గొని మాట్లాడారు. విద్యుత్తు భద్రతకు సంబంధించి సూచనలు చేశారు. నర్సింహులపేట జెన్‌కో ఏఈ పాండునాయక్, లైన్ ఇన్‌స్పెక్టర్ మల్సూర్, లైన్‌మెన్ లింగయ్య, అసిస్టెంట్ లైన్‌మెన్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.50 వేల విలువైన వస్తువుల అందజేత

నర్సింహులపేట, న్యూస్‌టుడే: నర్సింహులపేటలోని ఇంద్రకీలాద్రిపై వెలిసిన శ్రీ వెంకటేశ్వరస్వామి సమేత పద్మావతి, అలివేలు మంగమ్మ ఆలయంలో వెంకటేశ్వరస్వామికి ఉమ్మడి వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్మన్ మేరుగు సత్యనారాయణ కుమారుడు మేరుగు భరత్‌కుమార్- శ్రీవాణీ దంపతులు రూ.50 వేల విలువ చేసే ఇత్తడి శ్రీవారి పాదాలు, పీఠం, వెండి పూలు అందజేశారు. అర్చకుల మంత్రోచ్చరణల మధ్య వాటికి సంప్రోక్షణ జరిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీ నందనాచార్యులు, శ్రీ రాంబాబు చార్యులు అభిషేకాలు, అర్చనలు చేసి విలువైన వస్తువులు తీసుకున్నారు ఆలయ కార్యానిర్వహణాధికారి వేణుగోపాల్, బైరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పాదాలు, పీఠం, వెండి పూలు అందజేస్తున్న భరత్‌కుమార్-శ్రీవాణి దంపతులు

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

పెద్దవంగర, న్యూస్‌టుడే: విద్యార్థులకు సులభమైన మెళకువలు నేర్పించాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని కొరిపల్లి తండా ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను, తరగతి గదులను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకటరమణ, సీఆర్పీలు సంతోష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



అనాథలకు బాలవికాస చేయూత

తొర్రూరు, న్యూస్‌టుడే: డివిజన్ కేంద్రంలోని లయన్స్ భవనంలో అనాథ వృద్ధులు, దివ్యాంగులకు బాలవికాస సేవాసంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర వస్తువులు, బియ్యం, దుస్తులు, దుప్పట్లు, పిల్లలకు రాతపుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా బాలవికాస ప్రతినిధి సుజాత, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణాధ్యక్షులు సంతోష్, సోమరాజశేఖర్‌లు హాజరయ్యారు. సేవా కార్యక్రమాల్లో బాలవికాస ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. కొనసాగింపునకు తమవంతు సాయం అందిస్తామని పేర్కొన్నారు. వికాస ప్రతినిధులు వై.రమ, ఎం.రమ, శైలజ, శోభారాణి, సరిత, తదితరులు పాల్గొన్నారు.



గార్లకు తరలిన స్వామివారు



గార్లకు తరలివస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు

గార్ల, న్యూస్‌టుడే: మద్రిగూడెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి ప్రారంభించిన బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. బుధవారం ప్రత్యేక పూజలనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహాలను ఈవో ఆర్.సమత సమక్షంలో గార్లకు తరలించారు. ఎన్ఆర్ఐ డాక్టర్ పులి గోపాలరెడ్డి, ప్రమీలరెడ్డి దంపతులు, ధార్మిక కమిటీ సభ్యులు వెంట ఉన్నారు.

రెండో విడత పాఠ్య పుస్తకాల పంపిణీ

నెల్లికుదురు, న్యూస్‌టుడే: విద్యార్థులకు రెండో విడత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఎంఈవో ఎ.రామదాసు ప్రారంభించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు.

సైబర్ మోసంపై కేసు నమోదు

దంతాలపల్లి, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ సైబర్ మోసంపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. పెద్దముప్పారం గ్రామానికి చెందిన ఎల్ నాగరాజు అనే వ్యక్తి వాట్సాప్‌లో వచ్చిన సందేశాన్ని చూసేందుకు దానిని నొక్కారు. దీంతో అతడి బ్యాంక్ ఖాతా నుంచి రూ.1,66,600 నగదు డ్రా అయినట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్తంగా

నిలిచిపోయిన యూనియన్ బ్యాంకు సేవలు

కేసముద్రం, న్యూస్‌టుడే: అంతర్జాల సమస్యల కారణంగా కేసముద్రంలోని యూనియన్ బ్యాంకు సేవలు మూడు రోజులుగా నిలిచిపోయాయి. రైతులు, మహిళా సంఘాల బాధ్యులు, వినియోగారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం సాయంత్రం సమస్య పరిష్కారమైనట్లు బ్యాంకు సిబ్బంది తెలిపారు. గురువారం నుంచి యధావిధిగా బ్యాంకు కొనసాగనున్నట్లు తెలిపారు.

'సదరు' ఉత్సవాలకు తరలిరండి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: యాదవులు నిర్వహించే 'సదరు' ఉత్సవాలు ఈ నెల 27న హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ గార్డెన్‌లో ఏర్పాటుచేసినట్లు అఖిలభారత యాదవ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు, టీపీసీసీ బీసీ విభాగం కార్యనిర్వాహక అధ్యక్షుడు మేకల వీరన్నయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రులు అఖిలేష్‌యాదవ్, తేజస్వీయాదవ్, రాష్ట్ర మంత్రులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. యాదవులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చెకుముకి గోడ పత్రిక ఆవిష్కరణ

మానుకోట, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్ష-2024 గోడ పత్రికను జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ ఆవిష్కరించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు సాహితీ శ్రీనివాస్ మాట్లాడుతూ చెకుముకి ప్రతిభా పరీక్ష నవంబర్ 7న పాఠశాల స్థాయిలో, 21న మండల స్థాయిలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి శ్రీనివాస్, చెకుముకి జిల్లా కన్వీనర్ ఆగుర్తి సురేశ్, జిల్లా విద్యా కన్వీనర్ బ్రహ్మం, కృష్ణ ప్రసాద్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుడి ఆలయంలో పూజలు

కురవి, న్యూస్‌టుడే: భద్రకాళీ సమేత కురవి శ్రీవీరభద్రస్వామి ఆలయంలో కిసాన్ పరివార్ సంస్థ సీఈవో వివేక్ పూజలు చేశారు. బుధవారం ఆయన సతీమణితో కలిసి వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అభివృద్ధి కోసం తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు.

నూతన కోర్టులు ఏర్పాటు చేయాలని వినతి

తొర్రూరు: తొర్రూరులో అదనపు జూనియర్ సివిల్ జడ్జి, సబ్ జడ్జి కోర్టులను ఏర్పాటు చేయాలని స్థానిక బార్ అసోసియేషన్ ప్రతినిధులు హైకోర్టులో పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ సురేపల్లి నందాను బుధవారం కలిసి వినతిపత్రం అందించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్‌రాజు, రామకృష్ణలు మాట్లాడుతూ.. అదనపు కోర్టులు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని న్యాయసేవలు అందే అవకాశం ఉంటుందన్నారు. న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో స్థానిక న్యాయవాదులు వెంకన్న, యాకాంబరం, శ్రీనివాస్, ప్రదీప్, నాగరాజు పాల్గొన్నారు.

ఆయా కుటుంబానికి ఆర్థిక సాయం

మహబూబాబాద్ రూరల్(గూడూరు), న్యూస్‌టుడే: గూడూరు మండలం గాజులగట్టు పరిధిలోని పాటిమీదిగూడెం అంగన్ వాడీ ఆయా పెనక యాకమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న అయోధ్యపురం సెక్టార్ సూపర్‌వైజర్ విజయ కుమారి, అంగన్ వాడీ టీచర్లు ఆయా కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయం చేసి పరామర్శించారు.

26న ధర్మయుద్ధం మహాసభ

మరిపెడ: ఈ నెల 26న హనుమకొండ హంటర్‌రోడ్డులోని డీకన్వెన్షన్ హాల్‌లో జరిగే మాదిగల ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ కోరారు. మరిపెడ పట్టణంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

అనాథలకు చేయూత అందించాలి

దంతాలపల్లి: అనాథలు, వృద్ధులకు చేయూత అందించాలని బాలవికాస ప్రాజెక్టు కోఆర్డినేటర్ జ్యోతికిరణ్, తహసీల్దార్ చంద్రరాజేశ్వర్ కోరారు. దంతాలపల్లిలోని బాలవికాస కార్యాలయంలో జన వికాస ఆధ్వర్యంలో బుధవారం అనాథవృద్ధుల ఆదరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిత్యావసర సరకుల పంపిణీ నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు సుకన్య, శోభ, స్వర్ణలత, స్వరూప, యాకలక్ష్మి, నాగేష్, పూర్ణాచారి పాల్గొన్నారు.

శిశువుల్లో రక్తహీనత రానీయొద్దు

మహబూబాబాద్: శిశువుల్లో రక్తహీనతను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ సబ్ యూనిట్ అధికారి వి.శ్రీనివాస్ కోరారు. బుధవారం స్థానిక కట్టెలమండి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం భవిత, లలిత, అంగన్వాడీ టీచర్ మాధవి, ఆశ కార్యకర్తలు సరిత, పుష్ప పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

దంతాలపల్లి: ఈ నెల 21 నుంచి కనిపించకుండాపోయిన బాలిక ఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక కనిపించడం లేదని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు

పంట వివరాల నమోదులో పారదర్శకత అవసరం

నర్సింహులపేట : పంట వివరాల నమోదు కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల అన్నారు. వంతడపల గ్రామంలో వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులు చేపడుతున్న పంట వివరాల నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. వరి, పత్తి, మిరప పంటలను పరిశీలించి పంటల్లో అధిక దిగుబడులకు తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వినయ్‌కుమార్, రైతులు, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభాస్ జన్మదిన వేడుకలు

ఇనుగుర్తి, న్యూస్‌టుడే: పాన్ ఇండియా కథానాయకుడు ప్రభాస్ జన్మదిన వేడుకలు అభిమాన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. కేక్ కోసి అందరికీ పంచారు. కార్యక్రమంలో గబ్బెటి సురేష్‌కుమార్, తమ్మడపల్లి అశోక్, విష్ణు, రాకేష్, వినయ్, సునీల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కోస్తున్న ప్రభాస్ అభిమానులు

హామీలు అమలు చేయాలని ఉపవాస దీక్ష

మహబూబాబాద్ రూరల్ (గూడూరు), న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గూడూరులో భారాస నాయకులు 48 గంటల పాటు ఉపవాస దీక్ష చేపట్టారు. ఈ దీక్షను భారాస మండల పార్టీ అధ్యక్షులు వేం వెంకటకృష్ణారెడ్డి ప్రారంభించారు. హామీలు అమలు చేసే వరకు భారాస పోరాడుతుందన్నారు. దీక్షలో మాజీ కో-ఆప్షన్ సభ్యులు రహీం పాషా, ప్రచార కార్యదర్శి సురేష్ నాయక్, మండల నాయకులు పలువురు పాల్గొన్నారు.



గూడూరులో భారాస ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలో పాల్గొన్న నాయకులు

సీహెచ్‌సీలో శవ పరీక్ష గది పనులు

గార్ల, న్యూస్‌టుడే: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో శవ పరీక్షగది నిర్మాణ పనులు వారం రోజుల్లోగా పూర్తి కానున్నట్లు ఏఈ నరేష్ తెలిపారు. ఈ గది పూర్తయితే గార్ల, బయ్యారం, డోర్నకల్ మండలాలకు శవ పరీక్ష వ్యయ భారం పూర్తిస్థాయిలో తగ్గనుంది. సీహెచ్‌సీ అభివృద్ధికి మొత్తం రూ.16 లక్షలు నిధులు మంజూరవగా శవ పరీక్షగది, వంట గది, ఆర్‌వో ప్లాంటు పనులను చేపడుతున్నట్లు ఏఈ వెల్లడించారు.



ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తొర్రూరు, న్యూస్‌టుడే: అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను బుధవారం ఉదయం పట్టుకున్నట్లు ఆర్ఐ బషీర్ తెలిపారు. యథేచ్ఛగా రవాణాకు పాల్పడుతున్నారనే ఫిర్యాదుల మేరకు తహసీల్దార్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టగా, ట్రాక్టర్లను పట్టుకొని పోలీసులకు అప్పగించి, కేసు నమోదు చేయించామని వివరించారు. అనుమతులు లేకుండా రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.